క్లుప్తంగా

పంచశీల జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకుడు

పెంచికల్‌పేట్: మండలంలోని కొత్తగూడ అంబేద్కర్ భవన్‌లో పంచశీల జెండాను సంఘం అధ్యక్షుడు పెరుగు రవి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బుద్ధుడి పంచశీల సూత్రాలు పాటించి ప్రచారం చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. అంతకు ముందు గౌతమ బుద్ధుడు, డా. బీఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సిరిపురం భీమయ్య, పాగిడే ఆశన్న, సిరిపురం సదాశివ్, సుంపుటం రాజేశ్, కిరణ్, అనిల్, నవీన్, మహిళలు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో హోమం



హోమంలో పాల్గొన్న దంపతులు

కెరమెరి: మండల కేంద్రంలోని వివేకానందనగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద మంగళవారం అర్చకుడు కులకర్ణి బాపూదేవ్ ద్వారా భక్తులు హోమం పూజ నిర్వహించారు. జగదాంబ మాతకు వివిధ రకాల పిండివంటలతో తయారు చేసిన నైవేద్యాలు సమర్పించారు. గణపతి, కలశ, నవగ్రహ, దుర్గాయాగం చేశారు.

'వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం'



జైనూర్‌లో మాట్లాడుతున్న శ్యాంనాయక్

జైనూర్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని కాంగ్రెస్ నాయకుడు అజ్మీరా శ్యాం నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆశేపల్లి గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అబ్దుల్ ముఖీద్, సుద్దాల శ్రీనివాస్, ఆనంద్, వసీం, తదితరులు ఉన్నారు.

లారీ బోల్తా.. ప్రయాణికులకు తిప్పలు



బోల్తా పడిన లారీ

జైనూర్: జైనూర్ నుంచి ఆసిఫాబాద్ వెళ్తున్న లారీ బోల్తా పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సోమవారం లారీ బోల్తా పడటంతో మార్గంలో ప్రయాణిస్తున్న వాహనాలకు రెండు గంటలపాటు అంతరాయం ఏర్పడింది. అప్రమత్తమైన ఎస్సై సందీప్‌కుమార్ జేసీబీ, రెండు క్రేన్‌ల సహాయంతో లారీని పక్కకు తప్పించి రాకపోకలు పునరుద్ధరించారు.

వర్ధంతి సభ విజయవంతం చేయండి

తిర్యాణి: ఆదివాసీ ఆరాధ్యుడు వెడ్మ రాము 36వ వర్ధంతి సభను ఈనెల 26న మండలంలోని ఎదులపహాడ్ గ్రామంలో నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యుడు ఆత్రం సంతోశ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 9 తెగలకు చెందిన ఆదివాసీలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సనాతన ధర్మాన్ని కాపాడాలి

ఇచ్చోడ: సనాతన ధర్మాన్ని కాపాలని వైష్ణవ సదన్ పీఠాధిపతి నారాయణ్ మహరాజ్ అన్నారు. దసరా సందర్భంగా మండల కేంద్రంలో సనాతన ధర్మ సేవసమితి స్థాపన కార్యక్రమంలో భాగంగా మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. సనాతన ధర్మ సేవ సమితి స్థాపన ఆధ్వర్యంలో వెయ్యి మంది కార్యకర్తలు స్థానిక విఠలేశ్వర మందిరం నుంచి ర్యాలీని ప్రారంభించారు. అన్నభావుసాఠే, తల్లి తెలంగాణ, కుమురం భీం, అంబేద్కర్, శివాజీ, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంరం పాదయాత్రగా పట్వారిగూడ వరకు వెళ్లారు. సనాతన ధర్మ సమాజ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌రూరల్: మోతుగూడలో జమ్మి చెట్టుకు పూజ చేస్తున్న భక్తులు



కెరమెరి: జమ్మిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న పటేల్ నాగు



రెబ్బెనలో రావణ దహన కార్యక్రమం

ఘనంగా విజయదశమి

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని మోతుగూడ, బూర్గుడ, రాజుర, బెల్గాంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం ఘనంగా దసరా వేడుకలు నిర్వహించారు. వాహనాలకు ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. సాయంత్రం జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేసి సంబరాలు చేసుకున్నారు.

దహెగాంలో..

దహెగాం: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సోమవారం విజయదశమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా గ్రామ సమీపంలోని జమ్మి చెట్టు వద్దకు వెళ్లి శమీ పూజలు నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సనత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయుధపూజ చేశారు.

కెరమెరిలో..

కెరమెరి: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం జమ్మి చెట్టు వద్దకు చేరి గ్రామ పటేల్ నాగు, అర్చకుడు కులకర్ణీ బాపూజీ ఆధ్వర్యంలో జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సోమవారం దసరా పండగను ఘనంగా జరుపుకున్నారు. విజయదశమి పురస్కరించుకొని సింగరేణి ఆధ్వర్యంలో గోలేటి టౌన్‌షిప్‌లో, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శమీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోదండ రామాలయం ఆధ్వర్యంలో శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలతో పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం భీమన్న స్టేడియంలో జమ్మి చెట్టు వద్ద శమీ పూజలు నిర్వహించారు. రెబ్బెన గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయం సమీమంలో జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోలేటి, రెబ్బెన మండల కేంద్రాల్లో రావణ దహన కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.



దహెగాం: జమ్మి చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం దసరా పండగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు జమ్మి చెట్టుకు పూజలు చేసిన అనంతరం వాటి ఆకులను తీసుకొని పెద్దలు, గురువులు అందించి ఆశీస్సులు తీసుకున్నారు. దీంతో మండల వ్యాప్తంగా వేడుకలు అంబరాన్నంటాయి.

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని త్రిశూల్‌పహాడ్ గుట్టపై శ్రీసత్యనారాయణ స్వామి ఆలయ సమీపంలో మంగళవారం రాత్రి రావణ దాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నిర్వాహకులు రావణ ప్రతిమకు నిప్పంటించి దహన కార్యక్రమాన్ని చేపట్టారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



రెబ్బెనలో జమ్మిచెట్టు వద్ద శమీ పూజలు చేస్తున్న సర్పంచ్ అహల్యాదేవి



కెరమెరి : జమ్మి వేడుకల్లో ప్రజలు



రావణ దహనం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోనప్ప

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి



కెరమెరిలో కవాతు చేస్తున్న బలగాలు



వాంకిడి: మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరమణ

కెరమెరి: అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని డీఎస్పీ వెంకటరమణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సుల్తాన్‌గూడ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు 40 మంది పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ విజయన్, వాంకిడి సీఐ శ్రీనివాస్, కెరమెరి ఎస్సై గుంపుల విజయ్ తదితరులు ఉన్నారు.

వాంకిడి: ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ అన్నారు. ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలో పారా మిలిటరీ దళాలు ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. మండల కేంద్రంలోని ఖమాన అండర్‌పాస్ నుంచి తపాలా కార్యాలయం, హనుమాన్ మందిర్ కాలనీల మీదుగా కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సైలు డి.సాగర్, తేజశ్వినీ, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జైనూర్‌లో..

జైనూర్: గ్రామాల్లోని యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ వెంకటరమణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ప్రజలు అన్ని విధాలుగా సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘించరాదని పేర్కొన్నారు. అనంతరం జామిని నుంచి పొలాస మీదుగా ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్సై సందీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ముగిసిన బతుకమ్మ వేడుకలు



కెరమెరి: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఆసిఫాబాద్‌రూరల్: అంకుసాపూర్‌లో బతుకమ్మలతో చిన్నారులు, యువతులు



దహెగాం: గెర్రెలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్: సద్దుల బతుకమ్మ సోమవారం మండలంలోని మోతుగూడ, అంకుసాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు వివిధ రకాల పూలతో బతుకమ్మ పేర్చి పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు.

కెరమెరిలో..

కెరమెరి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, నెహ్రూనగర్, విద్యానగర్, వివేకానంద నగర్ కాలనీకి చెందిన మహిళలతో పాటు సాంగ్వి, అనార్‌పల్లి, ఝరి, మోడి, గోయగాం తదితర గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా వివిధ రకాల పాటలు పాడుతూ దాండియా ఆడారు. మహిళలు బతుకమ్మలను నెత్తిన మోసుకొని సాంగ్వి పెద్దవాగులో నిమజ్జనం చేశారు.

దహెగాంలో..

దహెగాం: మండల కేంద్రంలోని ఎస్టీ వాడ, గెర్రె తదితర గ్రామాల్లో సోమవారం సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి మహిళలు సంబరాల మధ్య పండుగ నిర్వహించుకున్నారు. రాత్రంతా బతుకమ్మ ఆడి గ్రామ సమీపంలోని వాగుల్లో నిమజ్జనం చేశారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జనం



కోలాటం ఆడుతున్న మహిళలు



దుర్గాదేవి శోభాయాత్ర

దహెగాం: శరన్నవరాత్రుల్లో భాగంగా మండల కేంద్రంతో పాటు బీబ్రా, గెర్రె, గిరవెల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి నిమజ్జనం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లో వీధుల గుండా అమ్మవారిని ఊరేగించగా మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు, యువతుల కోలాటం ఆకట్టుకుంది. అమ్మవారిని ఆయా గ్రామాల సమీపంలోని వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

అన్నదానం

ఆసిఫాబాద్‌అర్బన్: శరన్నవరాత్రులను పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీధర్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాన్ని స్వీకరించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రక్షణ వారోత్సవాలపై సమీక్ష

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో ఈ నెల 26నుంచి 31వరకు నిర్వహించే 54వ రక్షణ వారోత్సవాలపై మంగళవారం ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏరియా జీఎం మనోహర్ హాజరై అధికారులకు రక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటు జీఎం రాజేశ్వర రెడ్డి, ఏఎస్వో రవీందర్, కేకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, అధికారులు పాల్గొన్నారు.

'ప్రజా ధనాన్ని లూటీ చేశారు'

బేల: ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రజాధనాన్ని లూటీ చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్ పేర్కొన్నారు. మండలంలోని సదల్‌పూర్ భైరందేవ్, మహాదేవ్ ఆలయాల్లో మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత చప్రాల గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రజలకు చేసిందేమి లేదని, కోట్ల రూపాయలు ఆస్తులు సంపాదించుకున్నారని ఆరోపించారు. పేదలకు ఇళ్లు, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులకు పూర్తిస్థాయి రుణమాఫీ చేయలేదన్నారు. తెలంగాణలో ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని, ఆదిలాబాద్ ప్రజలకు అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, నాయకులు ఠాక్రే మురళీధర్, బోనిగిరివార్ గణేశ్, ఓల్లఫ్‌వార్ జ్యోతి, ఠాక్రే సందీప్, వడ్డె పోశెట్టి, శివకుమార్, కృష్ణ, వెంకటి పాల్గొన్నారు.

'మాటలతో పేదలను మభ్యపెడుతున్నారు'

బెజ్జూర్: గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేద ప్రజానికాన్ని మాటలతో మభ్యపెట్టి కాలం వెల్లదీస్తుందని కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్కీంల పేరిట అనేక స్కామ్‌లు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి సాగునీరు అందేలా చూస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలతోనే ప్రజలు ఆశీర్వదిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీవర్ధన, మండల అధ్యక్షుడు బుస శంకర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రావి శ్రీనివాస్

మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ పర్యటన

ఇంద్రవెల్లి: ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యమని బీజేపీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి నేత, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. మండలంలోని హర్కపూర్‌తాండ గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ముందుగా జగదాంబ, సేవాలాల్ ఆలయంలో గ్రామస్తులతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమమే తమ పార్టీ ఎజెండా అన్నారు. నిరుపేదల కోసం కేంద్రం వివిధ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అంతకుముందు గ్రామస్తులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజు, నాయకులు ముండే రాజేశ్వర్, రాథోడ్ భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.